జేబు దొంగ?

ఎమ్.వి.వి. సత్యనారాయణ

జగదాంబ సెంటర్ రద్దీగా వుంది. ఆఫీసుకు వెళ్ళేజనం! మార్కెటింగ్ చేయడానికి ఇళ్ళలోంచి బయట స్త్రీలు! బడులకు వెళ్ళే పిల్లలు! కర్మాగారాలకు పరుగుతీసే కార్మిక జనం! పోటీలకు పరుగెత్తే కారుల పందెంలాగా కార్లు!

జేబు దొంగ రాజు గుంపులో చొరబడ్డాడు.

సిటీ బస్సు వచ్చి స్టాపులో ఆగింది. సీతమ్మధార పోయే బస్సు ఖాళీగా వుంది. సీట్లకు సరిపడా జనం ఎక్కగానే బస్సు కదిలింది. రాజు నిట్టూర్చాడు.

గుమ్మాలకు వ్రేలాడుతోన్న ప్రయాణీకులతో పద మూడో నెంబర్ సిటీబస్సు వచ్చింది. అలవాటుకొద్దీ బస్సు స్టాప్ వదలి ఐలండ్ వద్ద ఆగింది.

ప్రయాణీకులు పరుగులు తీశారు.

రాజు పరుగెత్తి బస్సు గుమ్మం దొరకబుచ్చుకున్నాడు.

ప్రయాణీకులు నలిగిపోతున్నారు. యుద్ధవీరుల్లాగా

ఒకరినొకరు తోసుకుంటున్నారు.

బస్ కండక్టరూ పోలీస్ కానిస్టేబులూ తనుకి పట్టనట్టు చూస్తున్నారు.

పూల రథంలాగా కదిలింది బస్సు.

రాజు బస్సులో తన స్థానంలో నిలదొక్కుకున్నాడు. ప్రయాణీకులను వాళ్ళ జేబులో సొమ్ములను కళ్ళతో అంచనా వేయసాగాడు. చేతికి ఎవరిదో జేబు తగిలింది. బరువైన పర్స్! వేళ్ళతో జేబును వెతికాడు.

అతడు బస్సు ప్రయాణంలో బాలెన్స్ కాచుకోవడంలో మునిగివున్నాడు.

రాజు చటుక్కున పర్సు లాగాడు. అతికష్టంమీద వణికే నరాలను అదిమిపట్టాడు. తన పాంటు జేబులోకి పర్సును తోశాడు.

బస్సు ఎక్కిడి తొక్కిడిగా వుంది.

"పర్స్! పర్స్! బాబోయ్, నా పర్స్!...." అతడు గుండె లవిసేలాగా కేకలు పెడుతున్నాడు.

రాజుకి గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి.

సిటీ బస్సు మీద పిడుగు పడితే బాగుండుననిపించుతూంది.

కాని బస్సు స్టాపుకీ స్టాపుకీ మధ్యలో ఆగింది.

"వీడే అయ్యుంటాడు. నా పర్స్ కొట్టేసింది!" పర్స్ పోగొట్టుకున్న వ్యక్తి రాజు చేయి పట్టుకున్నాడు.

రాజుకి గొంతు తడారిపోయింది.

"నేను....కాదు...." చేయి గింజుకున్నాడు రాజు.

కండక్టర్ ప్రయాణీకులను క్రిందకు దింపాడు.

అతడు రాజు జేబులు తడమబోగాడు.

రాజు వారించబోయాడు. మరెవరో రాజా పర్ట

పట్టుకున్నారు. మరొకడు అతడి జేబులు వెతికాడు.

పర్స్ తీశాడు.

రాజుకి కళ్ళముందు మెరుపులు మెరిశాయి.

పర్స్ పోగొట్టుకున్న వ్యక్తి తేలుకుట్టినవాడల్లే అరుస్తున్నాడు.

"అది నా పర్స్ కాదు బాబోయ్.... నా పర్స్ బాబోయ్.... ఆరొందల రూ పా య లు! నా జీతం బాబోయ్!...."

ఈసారి రాజు తెల్లబోయాడు. తాను అతడి జేబులోంచే పర్స్ కొట్టేశాడు.

ఎవరో పర్స్ తెరిచారు.

పర్స్‌లో రెండు రూపాయలనోటూ నలిగిపోయిన కాగితంముక్కా వున్నాయి. పర్స్‌లో మైకాషీటు దాని వెనుక ఫోటో—

"అరె, అతడు నిర్దోషి! ఆ ఫోటో అతడిదే!"

రాజు నిభాయించుకున్నాడు. తన ఫోటో వున్న పర్స్ అది! ఆ పర్స్ ఎక్కడిది? తన జేబులోకి ఎలా వచ్చింది?

పర్స్ పోగొట్టుకున్నవాడు గోల తిపోతున్నాడు.

"పోలీస్ కంప్లయింట్ యివ్వండి!"

"అర రె, పాపం! అసలు దొంగను వదలిపెట్టాం!"

"అవును పాపం! అమాయకుడిని బాధ పెట్టే వాళ్ళం!"

రాజు జుత్తు సవరించుకుని పర్స్‌తో గుంపులోంచి బయటపడ్డాడు.

తనకి పర్స్ దొరకనందుకు భాధపడాలో, తన్నులూ కటకటాలు తప్పించుకున్నందుకు సంతోషపడాలో....

"అరె, రాజూ ఏం జరిగింది?" సైమన్, పకీరు అతడిని సమీపించారు. రాజు, సైమన్, పకీరు—ముగ్గురూ తోడు దొంగలు. రాజు జరిగింది చెప్పాడు వాళ్ళకు ఆశ్చర్యంగా.

తన జేబులో ఆరువందల రూపాయల పర్సును ఎవరు తీసుకున్నారు?

తీసుకున్నవాళ్ళే తన జేబులో ఈ రెండురూపాయలూ తన ఫోటో వున్న పర్సును ఉంచారు!

వాళ్ళకి తన ఫోటో ఎలా వచ్చింది?

పకీరు చేతిలో పర్సులోని నలిగిన కాగితం ముక్క వుంచాడు రాజు.

పకీరు అతడివంక ఎగాదిగా చూచి, కాగితం తెరిచాడు.

"సాయంత్రం నాలుగు గంటలకు ప్లాజా హోటలు రూం నెంబర్ పన్నెండులో కలుసుకుందాం!" అని వుంది కాగితంలో.

"ఎవర్రా రాసింది?" అడిగాడు పకీరు.

"ప్చ్...." అన్నాడు రాజు తనకి తెలియదన్నట్టు.

సైమన్ చీటీ చదువుతున్నాడు.

"నీ జేబులో ఈ చీటీ పెట్టినవాళ్ళే ఆరొందలున్న పర్స్ కొట్టేశారు!"

"ఒరే సైమన్! వాళ్ళకి నా ఫోటో ఎలా వచ్చింది?" అడిగాడు రాజు.

సైమన్, పకీర్ పకపకా నవ్వారు.

రాజు వాళ్ళవంక కోపంగా చూశాడు.

"మనం ఒకసారి ఎగ్జిబిషన్‌లో ఫోటోలు తీయించు కున్నాం!" అన్నాడు పకీర్.

"అయితే?"

"నీ ఫోటోని వాళ్ళెవరో సంపాదించి వుంటారు?"

"అదే ఎందుకంటాను?"

"ఏమో.... ప్లాజాకి వెళ్ళు! తెలుస్తుంది కదా!"

2

శంకర్ అటూ యిటూ చూశాడు. జగదాంబ సెంటర్‌లో టాక్సీ స్టాండువైపు వెళ్తోన్న రాజు, సైమన్ కనిపించారు. వాళ్ళను దృష్టిలోంచి తప్పిపోనకుండా జాగ్రత్తపడ్డాడు శంకర్.

పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లో ప్రవేశించాడు. అద్దాల గోడల బూత్!

టెలిఫోన్ చేస్తోన్నట్టు నటిస్తూ టాక్సీ స్టాండువైపు చూశాడు.

రాజూ, సైమన్ టాక్సీలో కూర్చున్నారు. టాక్సీ బయలుదేరింది.

శంకర్ టెలిఫోన్ చేశాడు.

అవతలవైపు వాళ్ళకి టాక్సీ బయలుదేరినట్టు సందేశం పంపించాడు.

శంకర్ యింకా బూత్‌లో వుండగానే టాక్సీ బారెక్స్ రోడ్‌లోకి మళ్ళింది. టాక్సీ బారెక్స్ దాటింది. పూర్ణ మార్కెట్ వద్ద మలుపు తిరిగింది.

"ప్లాజాలో మనకి రహస్యం తెలుస్తుందంటావా?" అడిగాడు రాజు.

సైమన్ అతడి తొడగిల్లి డ్రయివింగ్ సీటువైపు వ్రేలు చూపించాడు.

"ఏం? వాళ్ళ వ్యక్తి అంటావా?" అడిగాడు రాజు పెదిమలు కదుపుతూ.

"కావచ్చు!" గుసగుసలాడాడు సైమన్.

టాక్సీ చిన్న కుదుపుతో ఆగింది.

బీట్ పోలీస్ ట్రాఫిక్‌ను అదుపులో పెడుతున్నాడు. ఎవరో వ్యక్తి టాక్సీని సమీపించాడు.

"డ్రయివింగ్ లైసెన్స్!" అన్నాడు అతడు డ్రయివర్‌ను ఉద్దేశించి.

డ్రయివర్ తన డ్రయివింగ్ లైసెన్స్ చూపించాడు.

తణిఖీ చేస్తోన్న వ్యక్తి వెనక సీట్లలోకి చూశాడు.

"మీలో రాజు ఎవరు?" అని అడిగాడు.

రాజు సైమన్ తెల్లబోయారు.

"ఎందుకు?" అడిగాడు సైమన్.

"నువ్వు రాజువా?" అడిగాడు తణిఖీ చేస్తోన్న వ్యక్తి.

"కాదు!"

అతడు తన చూపును రాజు వైపు మరల్చాడు.

"నువ్వు రా. పోలీసుల రికార్డులో సంతకం పెట్టాలి!"

"ఎందుకు సార్?" రాజు గొంతు తడారిపోయింది.

"సిటీ బస్సులో దొంగతనం గురించి!"

"నేను చేయలేదని ఋజువయింది కదండీ!"

"కావచ్చు. కమాన్! చర్చ అనవసరం!"

రాజు తల త్రిప్పి సైమన్‌ని చూశాడు.

సైమన్‌కి విచిత్రంగా వుంది. వెళ్ళమన్నట్టు రాజుకి సైగ చేశాడు. రాజు మెల్లగా టాక్సీ దిగాడు.

ట్రాఫిక్ కదిలింది. రాజుతో అతను రోడ్డుమీద నడుస్తున్నాడు.

సైమన్ వులిక్కిపడ్డాడు. సీటులో తన ప్రక్కగా చిన్న కాగితం ముక్క! దాన్ని అందుకుని చదువుతున్నాడు.

"అనవసరంగా కలగచేసుకోనక! ప్రాణాపాయం!"

సైమన్ నుదురు చిట్లించాడు.

"నన్ను ఎక్కడికి తీసుకు వెళ్తున్నారు?" అడిగాడు రాజు.

"ప్లాజాకి!"

ఇద్దరూ కారును సమీపించారు. నీలిరంగు అంబాసిడర్ కారు.

రాజు కారు ఎక్కి కూర్చున్నాడు. అతడి ప్రక్కగా ఆగంతకుడు కూర్చున్న తర్వాత కారు కదిలింది.

విశాలమైన మైదానం దాటి ప్లాజా హోటల్ ముందు ఆగింది.

సైమన్ పోర్టికోలో పచార్లుచేస్తూ కనిపించాడు.

"రా! వెనకనుండి మెట్లదారి వుంది!" అతడు రాజును హోటలు వెనుక భాగానికి తీసుకు వెళ్ళాడు.

ఎవరూ ఉపయోగించని మెట్లు కావడంతో ఇద్దరూ సులువుగా మెట్లు ఎక్కారు. రెండో అంతస్థులో వుంది పన్నెండో నెంబర్ గది.

ఆగంతకుడు గది తలుపు తట్టాడు.

తలుపు తెరుచుకుంది.

రాజు తలుపు వెనుక ప్రత్యక్షమైన ఆకారాన్ని చూడగానే కళ్ళు త్రిప్పుకోలేకపోయాడు.

తలుపు అవతల నిలబడిన యువతికి ముప్ఫయి సంవత్సరాలుంటాయి. అయినా శరీర బింకంలో ఇరవై ఏళ్ళ అమ్మాయిలాగా వుంది. ఎర్రటి శరీరం, శరీరానికి అతుక్కుపోయిన మాక్సీ, పెదిమలకు ఎర్రటి లిప్‌స్టిక్, విశాలమైన నేత్రాలూ, నేత్రాలమధ్య ఉమ్మడి ఆస్తిలాగా సంపెంగలాంటి ముక్కూ, మాక్సీలోంచి దాగని యవ్వనమూ....

రాజు సభ్యత కాదనుకున్నాడు.

ఆమె మనోహరంగా నవ్వింది.

"లోపలికి తీసుకురా జోషీ!" అందామె అధికార పూర్వకంగా.

రాజుకి తనని వెంట పెట్టుకువచ్చిన రాజు 'జోషీ' అన్న సంగతి అర్థమయింది. ఇద్దరూ గదిలోకి అడుగు పెట్టారు.

డబుల్ రూం అది! గదిలో డబుల్ కాట్ వుంది. వాటికి ఎదురుగా ఇవతల గోడ దగ్గర టేబులూ, దాని మీద టెలిఫోన్, టేబులుకి వున్న గోడకి విశాలమైన కిటికీ, టేబులుమీద టెలిఫోనూ, గదిలో ఒక ప్రక్కగా సింకూ.... ప్రక్కగా... కిటికీలోంచి బయటకు చూశాడు రాజు.

కిటికీకి అవతలగా భవనం వుంది. అది సన్ ఎన్ సాండ్ హోటల్ అని తనకి తెలుసు. ఈ గది కిటికీకి సమాంతరంగా అవతలి హోటల్ గది కిటికీ వుంది.

రెండు భవనాల మధ్య సన్నటి రోడ్డు. పాతిక అడుగుల రోడ్డు.

రోడ్డుకి అటు సన్ ఎన్ సాండ్! ఇటు ప్లాజా!

రాజు తల విదిలించాడు.

ప్రక్కగా వున్న బాత్ రూంలో నీళ్ళ చప్పుడవుతోంది.

"బాస్ లేరా మాడమ్?" అడిగాడు జోషి.

ఆమె బాత్ రూంవైపు కళ్ళు తిప్పింది. బాత్ రూం తలుపు తెరుచుకుని ఆజానుబాహువు బయటికి వచ్చాడు.

ఆమెని చూచిన కళ్ళతో అతడిని చూచేటప్పటికి

రాజుకి తల గిర్రున తిరిగింది.

ఆరడుగుల పైచిలుకు ఎత్తులో ఇంచుమించుగా అతడు తుమ్మ మొద్దులాగా వున్నాడు. బుర్రమీసాలూ, సన్నగా గీసిన గడ్డం, కుడి కన్నులో తెల్లటి పువ్వూ, గారపళ్ళూ చిరాకు పెరిగిన జుత్తు....

తుమ్మ మొద్దు వొంటిన రంగుల టర్కీ టవలు వుంది.

"రాజాసాబ్‌ను లాక్కొచ్చావుట్రా జోషీ!" అతడి గొంతు కర్కశంగా వుంది.

"అవును బాస్! కింద సైమన్ వున్నాడు!" అన్నాడు జోషి.

"వాడిని ఎందుకు రానిచ్చావు?" వదులుగా వున్న పాంటులోకి మారాడు బాస్.

"వాడు వస్తే మాత్రం మనకేం?" కల్పించుకుంది ఆమె.

"నీకు తెలీదు షకీలా! సైమన్ మనలను డబుల్ క్రాస్ చేయాలని చూశాడు."

రాజుకి వాళ్ళ సంభాషణ మతి పోగొడుతోంది.

సైమన్ వాళ్ళను మోసం చేయడమా?

సైమన్‌కీ వీళ్ళకూ సంబంధం ఏమిటి?

అసలు తనను వీళ్ళు ఎందుకు తీసుకువచ్చినట్టు?

తననే తీసుకురావాలని వీళ్ళకు ఎలా తోచింది?

"నువు వెళ్ళరా జోషీ! సైమన్ పని చూడు!" అన్నాడు బాస్.

జోషీ వెళ్ళిపోయాడు.

షకీల కుర్చీలు లాగింది. రాజును కూర్చోమని సైగ చేసింది.

రాజు కూర్చున్న తర్వాత బాస్ టేబులుకి జారగిలపడి

కుర్చీలో కూర్చున్నాడు. అతడి వెనకనుండి టెలిఫోన్ మీదుగా కిటికీలోంచి గాలివస్తోంది.

గదిలో వాతావరణం ఆహ్లాదకరంగా వుంది.

రాజు మాత్రం ఇబ్బందిగా కదిలాడు.

"మీ పూర్వీకులు బాగా డబ్బున్న జమిందారులు! గుర్తుందా?" అడిగాడు బాస్.

రాజు ఆ ప్రశ్న అడిగింది తనను అనుకోలేదు.

అయినా అప్రయత్నంగా, "మా పూర్వీకులా?" అన్నాడు.

"అవును. మధురవాడకి పది మైళ్ళ కి అవతలగా ఒకప్పటి జాగీరు ఈనాడు నాశనమైపోయింది. అక్కడుండే ప్రజలు దారి దోపిడీగాళ్ళకి దడిచి ఎటుపడితే అటు దారి చూసుకున్నారు. కానీ ఇప్పటికీ అక్కడ మీ పూర్వీకుల ఇంద్రమహల్ వుంది. జాగీరులో వున్న ఆ సిపాయిలను ఇంద్రమహల్ లో దాచినట్టు చెప్పుకున్నారు."

"ఇదంతా నిజమా?"

బాస్ చురుకుగా చూశాడు. "నీతో పనికట్టుకుని అబద్ధాలు చెప్పవలసిన పనిలేదు."

"ఇది చెప్పడానికేనా నా జేబులో చీటీ పెట్టారు!"

బాస్ తలూపాడు.

షకీల పకపక నవ్వి, బరువైన వస్తువును రాజు వొడిలో పడేలాగా విసిరింది.

"ఆరొందల రూపాయిలున్న పర్స్!" నవ్వింది షకీలా, ముత్యాలు వొంపుతోన్నట్టు.

"నువ్వు ఏడు సంవత్సరాల వయసులో వుండగా నీ తల్లిదండ్రులు జాగీరును వొదిలి పారిపోయారు. వాళ్ళు

భయపడ్డట్టే ఆ రాత్రి ఇంద్రమహల్ లూటీ అయింది. దారిలో మీ తలిదండ్రులు వాళ్ళకి ఆహుతయ్యారు. నువ్వు ఎలా బతికి బయటపడ్డావో తెలియదు."

"ఇంతకీ మీరు...."

"ఆనాటి దోపిడీ ముఠాకీ మాకూ సంబంధం లేదు."

"అయితే ఈ విషయాలు ఎలా తెలిశాయి?"

"మా రొటీన్ వర్క్లో ఈ విషయాలు బయట పడ్డాయి. నాలుగు రోజులుగా ఇంద్రమహల్‌ను త్రవ్వి తిరగవేశాం. ఏమీ ఫలితం దక్కలేదు."

"నన్ను యిప్పుడు పిలిపించి ఈ సంగతులు చెప్పడంలో...."

"పాయింటికి వస్తున్నాను!" కారణం లేకుండానే బాస్ నవ్వాడు. "నువ్వు ఏడు సంవత్సరాల వయసు వచ్చేవరకూ ఇంద్రమహల్లోనే వున్నావు. ఆ రాత్రి మీ వాళ్ళు ఇంద్రమహల్‌ని ఖాళీచేసేటప్పుడు వాళ్ళతో నువ్వు వున్నావు. మా అంచనా ప్రకారం ఆనాటి మనుషులలో సజీవంగా వున్నది నువ్వు ఒక్కడివే!"

"అయితే మాత్రం నాకు ఆనాటి జ్ఞాపకాలు...."

"లేవని బుకాయించక! నువ్వు ఆ పరిసరాలకు ఇంత వరకూ వెళ్ళలేదు. నువ్వు మరచిపోయి వుండడం నిజం కావచ్చు. కాని, తిరిగి నువ్వు ఆ పరిసరాలను చూడటం తటస్థించే....ఆనాటి జ్ఞాపకాలు నిన్ను తప్పక తరుము తాయి."

"ఇంద్రమహల్‌లో గుప్తంగా వున్న ఆస్తి విలువ పదిహేను కోట్లకి పైగా అని అంచనా!" షకీలా కలగ చేసుకుంది.

"ఇంద్రమహల్ నా వారసులదని తెలిసి నవ్వాలో

ఏడ్వాలో నాకు తెలిసిరావడంలేదు!" నిర్లిప్తంగా అన్నాడు రాజు.

"ఏం?" షకీలా అతడి కుర్చీమీద చెయ్యివేసింది.

"నిధినిక్షేపాల రహస్యం చెప్పమని నన్ను తినేస్తారేమో!"

"అవును. నువ్వు ఆ పరిసరాలు పరిశీలించు. నిధిని కనిపెట్టు. మనం పంచుకుందాం!"

"సైమన్ మీకెలా తెలుసు?"

"నీ ఫ్రెండ్....అంతే తెలుసు మాకు!"

రాజు మాట్లాడలేదు.

"నువ్వు ఆ స్త్రీని త్వరగా చేజిక్కించుకోవాలి. ప్రభుత్వం ఇంతకాలంగా ఇంద్రమహల్‌ను పట్టించుకోలేదు. ఇకమీద ప్రభుత్వం దృష్టిలో ఇంద్రమహల్ పడవచ్చును. జిల్లా కలెక్టర్ అక్కడ త్రవ్వకాలు జరుగుతోన్నట్టు అనుమానిస్తున్నాడు. మనం ఎంత త్వరగా నిధినిక్షేపాలతో బయటపడితే అంత మంచిది!"

"నేను చెప్పకపోతేనో!"

"మేం చెప్పించుతాం!" షకీలా నవ్వింది.

ఇప్పుడు ఆమె నవ్వు మనోహరంగాలేదు.

గదిలోని టెలిఫోన్ గణగణలాడింది.

3

జోషి మెట్లు దిగాడు. మెయిన్ హాలులో నిలబడ్డాడు. అతడి కళ్ళు పోర్టికోలో వెతికాయి. సైమన్ లేడు. జోషి పోర్టికోలోకి వచ్చాడు.

సైమన్ టాక్సీలో కూర్చున్నాడు. అతడి చూపు రెండో అంతస్తుమీద వుంది.

జోషి మెయిన్ హాలులోకి తిరిగివెళ్ళాడు.

కౌంటర్‌లో అడిగి టెలిఫోన్ తీసుకున్నాడు. రిసీవరెత్తి రింగ్ చేశాడు.

ఆపరేటర్ పలికింది.

"రూం నెంబర్ పన్నెండు!" అన్నాడు జోషి.

అవతల బాస్ పలికాడు.

"రాజు గదిని వెతుకు! పెట్టెలలో పాత కాగితాలుంటే తీసుకురా!" ఆదేశించాడు బాస్.

"సైమన్‌తో వెళ్ళనా?"

"ఆఁ!" అవతల క్లిక్‌మంది.

జోషి ఫోన్ పెట్టేశాడు. చకచక ఆవరణలోకి నడిచాడు.

సైమన్‌ని సమీపించాడు.

"నా పేరు జోషి, బాస్ పంపించారు!" అన్నాడు.

సైమన్ నుదురు చిట్లించాడు. "అరె! ఇందాక రాజును తీసుకువెళ్ళింది నువ్వే కదూ!"

"అవును."

"నిజంగానే పోలీస్ వ్యవహారంలో చిక్కుకున్నాడనుకున్నాను!"

"పద!" డోర్ తెరిచాడు జోషి. "రాజు యింటికి వెళ్దాం!" అన్నాడు.

"ఎందుకు? వాడి రూంలో ఎలాంటి పత్రాలూ లేవు."

"అప్పుడే నువు వెతికావన్నమాట!"

టాక్సీ కదిలింది.

"అవును పత్రాలు దొరికివుంటే రాజుతో సగం-సగం ఎప్పుడో పంచుకునేవాడిని!"

రాజు యింటిముందు టాక్సీ ఆగింది.

ఇద్దరూ టాక్సీ దిగారు. సైమన్ టాక్సీ అద

చెల్లించాడు. టాక్సీని వెళ్ళనిచ్చి యిద్దరూ రాజు గదిలో చొరబడ్డారు. గదిని వెతికారు. పాత యినుపపెట్టెలు బోర్లించారు. వంట యిల్లు చిందరవందర చేశారు. బట్టల పెట్టె తిరగతోడారు. మూలమూలల్లో వాళ్ళు శోధించారు.

జోషి గదిలోకి పిచ్చిగా చూశాడు.

అతడి చూపు గోడమీద వున్న ఫోటోలమీదపడింది.

మరుక్షణంలోనే ఫోటోలు పగిలాయి. ఒక ఫోటోలో ఆరేళ్ళ వయసులో వున్న పిల్లవాడున్నాడు.

“వీడిలో రాజు పోలికలున్నాయి!” అన్నాడు జోషి.

“అవును. రాజు చిన్నప్పటి ఫోటో యిది!” సైమన్ కళ్ళు పెద్దవయ్యాయి. ఫోటోకి మెడలో తయెత్తువుంది.

అటువంటి తాయెత్తును తాను ఎన్నడూ రాజువద్ద చూడలేదు. కాని.... చటుక్కున గుర్తొచ్చింది. తాను ఆ తాయెత్తును చూశాడు. ఎప్పుడు? ఇప్పుడే.. ఎక్కడ.... పాత ఇనుప పెట్టెలోని వస్తువులు తిరగవేస్తోన్నప్పుడు అవును....అక్కడే.... దాని రింగులో రంగువెలసిన తాడు వున్నట్టుంది. సైమన్ తిరగవేసిన ఇనుపపెట్టె వద్దకు పరుగెత్తాడు.

చెత్తను అటూ యిటూ కలియపెట్టాడు.

అదిగో తాయెత్తు! నల్లగా మాడిపోయిన దీర్ఘ చదురపు బిళ్ళ!

చటుక్కున అందుకోబోయాడు సైమన్!

అతడి వీపుమీద పిడిగుద్దు పడింది. సైమన్ తుళ్ళి గుట్టకి అవతలపడ్డాడు.

జోషి వంగాడు. తాయెత్తువైపు చేయిచాపాడు. సైమన్ ఫీట్లు లంకించుకున్నాడు. శక్తికొద్దీ మందుకు

గుంజాడు. జోషి బోర్లపడ్డాడు. పడేటప్పుడు తెరిచి వుంచిన పాత పెట్టెలో ముఖంపడింది. ఆ వెంటనే పెట్టె మూత టప్ న మూసుకుంది.

జోషి కెవ్వున అరిచాడు. అతడి తలమీద సుత్తులతో కొట్టినట్లు అయింది. సైమన్ లేచాడు. జోషిని డొక్కలో తన్నాడు.

జోషికి స్పృహ తప్పింది.

సైమన్ తాయెత్తును అందుకున్నాడు.

గుమ్మంలో అలికిడయింది.

పకీరు లోపలికి వచ్చాడు. శత్రురాజులు ధ్వంసం చేసిన రాజ్యంలాగా వుంది ఆ గది!

“ఇదేమిట్రా సైమన్?” అడిగాడు పకీరు.

సైమన్ యథాలాపంగా తాయెత్తును గుప్పెట్లో దాచాడు. పైకి లేచాడు బట్టలు దులుపుకున్నాడు. తాయెత్తును జేబులో జారవిడిచాడు.

“వీడెవడో రాజు గదిలో చొరబడ్డాడు. వెతుక్కుంటున్నాడు. నేను అడ్డంపడ్డాను” అన్నాడు సైమన్.

“రాజు గదిలో ఏం వుంది?”

“వాడి మొహం! అసలు నాకే వాడింటికి మూతులు నాకేవాడు వెళ్ళాడట!” సైమన్ బలవంతంగా నవ్వాడు.

పకీరు అనుమానంగా చూడసాగాడు.

4

మెటడోర్ వ్యాన్ రోడ్డును మింగేస్తో పరుగులు తీస్తోంది. మధురవాడ క్రమంగా వెనకబడుతోంది.

బాస్ సీటుమీద వెనక్కి వాలాడు.

వ్యాన్ని డ్రయివ్ చేస్తోన్న జోషి దృష్టి తిప్పకుండా తలపంకించాడు.

వెనక సీట్లో కూర్చున్న షకీలా బాస్‌ను చూసి నవ్వింది.

జగ్గూ ఆమెకు ఎదుటి సీట్లో కూర్చున్నాడు. తీరికగా సెక్స్ పత్రికలు చదువుకుంటున్నాడు.

వ్యాన్‌లో నవ్వు వినిపించి తలెత్తి చూసి తిరిగి చదువులో మునిగిపోయాడు. రాజు సీట్లో నిద్రపోతున్నాడు.

వ్యాన్ హైరోడ్డు వదిలిపెట్టింది. మట్టిరోడ్డులోకి తిరిగింది.

ఎటు చూచినా చెట్లు ఒత్తుగా పెరిగివున్నాయి. వాటిలో ఎక్కువ భాగం తాటిచెట్లు! నేలంతా బరాణీ తీగ చిట్టడవిలాగా అల్లుకుపోయింది. రానురాను రోడ్డు మట్టిపెళ్ళలు లేగివుండి. వ్యాన్ గతుకులలో ఎగిరెగిరి పడుతోంది.

ప్రయాణం కష్టంగా వున్నప్పటికీ జోషీ నేర్పుగా నడుపుతున్నాడు. వ్యాన్ చెట్ల గుబురుల్లోంచి చొచ్చుకుపోయింది. ఎటు చూచినా పొదలు. వ్యాన్‌కి అవి అడ్డం రాలేదు.

వ్యాన్ కుదుపులకు రాజు లేచాడు.

కిటికీలోంచి బయటకు చూశాడు.

ఎదుట విశాలమైన భవంతి! గోడలు పగిలి కూలిపోయి వున్నాయి. వాటి అసలు రంగు ఏమిటోగాని గోడలు వర్షం తడికి పాకుడుకట్టి నల్లగా వున్నాయి. పై అంతస్తు కిటికీలు విరిగిపోయి వున్నాయి. విరిగిన గోడల మధ్య రకరకాల మొక్కలు పెరిగివున్నాయి.

రాజు తల విదిలించాడు. తాను ఈ భవంతిలో పుట్టాడా? ఇంద్రమహల్ అంటే ఈ భవంతేనా? తనకి

ఆసలు ఇటువంటి భవంతి వున్నట్టు కలలో కూడా వూహించివుండడు.

ఈ భవంతిలో నిధి వుందా?

బయట ఆవరణ తవ్వి పోగులు పెట్టినట్టుంది.

జోషి వ్యాన్‌లోంచి మట్టిమీదకు దూకాడు.

బాస్ దిగాడు. జగ్గూ, రాజూ, షకీలా వ్యాన్‌లోంచి బయటపడ్డారు.

సింహద్వారం పగిలి తలుపులు పొరలు వూడిపోయి వున్నాయి. ఎటుచూచినా సాలెగూళ్ళూ, బూజూ, నేలంతా చెత్తాచెదారంగా పడివుంది.

"ఇంద్రమహల్ ఏ క్షణాన కూలుతుందో!" బాస్ తలుపులమీద చెయ్యివేసి తోశాడు. అవి కదలడానికి బలమంతా వుపయోగించవలసివచ్చింది. తలుపులు కీచుమంటూ తెరుచుకున్నాయి. అయిదుగురూ భవనంలోకి నడిచారు. గబ్బిలాలు రెక్కలు విప్పి బయటికి ఎగిరాయి.

పెద్ద హాలు, ఒకవైపు మెట్లు మెట్లక్రింద గదుల వరసలూ, మెట్లమీద గదులూ అన్నీ వాతావరణం తాకిడికి గురయివున్నాయి. కొన్ని గదుల తలుపులు లేవు.

బాస్ హాలుచుట్టూ పరికించాడు. చెవులు ఓరగా పెట్టి విన్నాడు. మేడమీద ఎవరో నడుస్తోన్న చప్పుడు వినిపిస్తోంది.

"అడుగుల చప్పుడు వినిపిస్తోందా?" అడిగాడు బాస్.

షకీల భయంతో బిగుసుకుపోయింది.

బాస్ మెట్లు ఎక్కసాగాడు.

అడుగుల చప్పుడు ఆగిపోయింది. అయిదుగురూ భవంతి మొత్తం వెతికారు.

"సందేహం లేదు! ఎవరో తిరిగారు!" అన్నాడు

జోషి. అతడి కళ్ళు కిటికీ బయట వున్న చెట్టుమీద పడివుంది. కిటికీలోంచి చెట్టుమీదకు దిగవచ్చును.

చెట్టుకొమ్మలకు చొక్కాకి సంబంధించిన గుడ్డముక్క తగులుకునివుంది.

రాజు ఆ ముక్కను గుర్తించాడు. బిగుసుకుపోయాడు,

అది సైమన్ తొడుక్కునే చొక్కా!

అంతస్తు దిగి అందరూ బయటికి పరుగెత్తారు.

సరిగ్గా అప్పుడే ఎక్కడినుండో కారు బయలుదేరిన చప్పుడు వినిపించింది.

“వ్యాన్ ఎక్కండి!” అరిచాడు బాస్.

జోషీ చక్రాలవద్ద వొరిగాడు. టైర్లలో గాలిలేదు.

5

రాజుకి అకస్మాత్తుగా మెలకువ వచ్చింది.

గదిలో కొవ్వొత్తి వెలుగుతోంది. వెలుగులో ఆ గది భయంకరంగా వుంది. ఇంద్రమహల్‌లో ఒక గది! కింద అంతస్తులో.

ఉదయంనుండీ తాము అయిదుగురూ భవంతి మొత్తం తవ్వి పోగులు పెట్టారు. ఎక్కడా ఎర్రటి ఏగాణీ కూడా దొరకలేదు.

బాస్ తనని పూర్వ జీవితాన్ని గుర్తుకు తెచ్చుకోమని వేధించాడు. తనకి గుర్తురానిదే ఏం లాభం! కాని బాస్ నమ్మడంలేదు.

తలుపుల బయట ఎవరో నడుస్తోన్న చప్పుడయింది.

రాజు చటుక్కున లేచాడు.

“రాజూ! తలుపు తియ్యి!” బాస్ పిలిచాడు.

రాజు తలుపు తెరిచాడు. బాస్, అతడి వెనక వకీలా గదిలోకి వచ్చారు. నేలమీద పరచిన చాపమీద కూర్చు

న్నారు.

"సైమన్ ఎక్కడెక్కడుంటాడు?" అడిగాడు బాస్.

రాజు షకీల మీదనుండి బలవంతంగా దృష్టి మరల్చు కున్నాడు. చీకట్లో మెరుపులాగా పాడుపడిన యింట్లో ఆమె చందమామలాగా మెరుస్తోంది.

"సైమన్? ఎందుకు?" అడిగాడు రాజు.

"వాడిచేతికి నీ తాయెత్తు దొరికింది! ఆ తాయెత్తులో నిధి రహస్యం వుండివుండవచ్చు!"

"తాయెత్తా?"

"అవును. నీ పాత పెట్టెలలో పనికిమాలిన వస్తువులాగా యింతకాలం పారవేసి వుంచావు!"

రాజు ఆలోచనలో పడ్డాడు.

సైమన్‌కి తాయెత్తు దొరికే ఈ భవంతికి వచ్చాడా? నిధి రహస్యం నిజంగా తాయెత్తులో వుందా? సైమన్ ఈ భవంతిని వెతికినట్టు వీళ్ళు గుర్తించారా? సైమన్‌కి తాయెత్తు దొరికినా ఇంద్రమహల్ యిక్కడ వున్నట్టు అతడికి ఎలా తెలిసింది?

"ఏమిటి ఆలోచిస్తున్నావు? నిధిని నువ్వూ సైమన్ గాడూ కలసి పంచుకోవాలని యెత్తు వేస్తోన్నట్టుంది! నీ ప్రయత్నం సాగదు! నిన్నూ వాడినీ ముక్కలుగా నరికి పారేస్తాం!" కటువుగా అరిచాడు బాస్.

రాజు భయంగా చూశాడు.

షకీల అతడిని గోముగా చూస్తోంది.

"జగ్గా వెళ్ళి వచ్చాడు వైజాగ్. అంతా గాలించి వచ్చాడు. సైమన్ యెక్కడెక్కడ దాక్కుండే అవకాశాలున్నాయో స్పష్టంగా చెప్పు! అనవసరంగా హింస పడక!" అంది షకీలా.

ఆమె కళ్ళు కుటిలంగా మెరుస్తున్నాయి.

రాజు చెప్పాడు.

"నాన్సెన్స్! ఆ ప్రదేశాలన్నీ గాలించి వచ్చాడు జగ్గా" అరిచింది షకీలా.

అకస్మాత్తుగా భవంతిలో కెవ్వుమన్న కేక!

వెన్ను జలదరించేలాగా వులిక్కిపడ్డారు ముగ్గురూ. బయటకు పరుగెత్తారు. మెయిన్ హాలులో జగ్గా పడి వున్నాడు.

ముగ్గురూ అతడిని చుట్టుముట్టారు.

జగ్గా తలపట్టుకుని మూలుగుతున్నాడు.

బాస్ అతడి మీదకు ఒంగి, "జగ్గా!....జగ్గా...." అన్నాడు.

జగ్గా మెల్లగా కళ్ళు తెరిచాడు.

"సైమన్ గాడు నన్ను సైతాన్ లాగా వెంటాడాడు. తలమీద బలంగా కొట్టి భవంతిలోకి తోశాడు. మెయిన్ హాలులో పడ్డాను" మూలుగుతున్నాడు జగ్గా.

బాస్ కళ్ళల్లో నిప్పులు కురిశాయి.

"వాడిని....వాడిని...." పళ్ళు పటపటలాడించాడు.

షకీల వ్యంగ్యంగా నవ్వింది. "నేను చెప్పలేదు నీకు, ఈ రాజుగాడూ, ఆ సైమన్ గాడూ కలసి నిధి పంచుకుంటారు. తాయెత్తులో నిధి రహస్యం వుంది. సైమన్ గాడు...."

"ఆగు! వాడికి యింకా నిధి అంది వుండదు!"

"నేను అందింది అన్నానా? ఈ రాజుగాడికి ఈ పరిసరాల తాలూకా మాప్ చూపిస్తాడు. నిధి ఎక్కడుందో సులువుగా తెలుస్తుంది."

"కరెక్టు! రాజును కలవడానికే వాడు ఈ అర్థ

రాత్రి వేళ యిటు వచ్చాడు. జగ్గూను కొట్టాడు! వెతుకుదాం!"

"బాస్! ఈ చీకట్లోనా?"

"ఫ్యాన్ లైట్లు ఆన్ చెయ్యి. ప్రయత్నం చేద్దాం!" బాస్ బయటకు కదిలాడు.

జోషి మెట్లు దిగి వచ్చాడు.

రాజు విస్త్రాణగా ఫీలయ్యాడు. మెట్లమీద కూర్చుండిపోయాడు. జోషీ; పకీలా బయటకి వెళ్ళారు.

జగ్గూకి స్పృహ తప్పింది.

మెయిన్ హాలులో కొవ్వొత్తి వెలుగు నిస్సహాయంగా చీకటితో పోరాడుతోంది.

రాజుకి చీకట్లోంచి చిటికెలు వినిపించాయి.

మెట్ల కింద గదిలో యెవరో నిలబడివున్నారు.

"రాజూ!" అతడు గుసగుసలాడాడు.

రాజు నిర్ఘాంతపోయాడు.

అతడు సైమన్! అతడి ప్రక్కగా మరో ఆకారం కనిపిస్తోంది.

"వీడు పకీర్!" అన్నాడు సైమన్.

6

"వాళ్ళ తలుపులకు గొళ్ళెం పెట్టావా?" అడిగాడు రాజు, గుసగుసగా.

"పెట్టానురా కాని ఏ గదిలోంచీ అలికిడిలేదు!" అన్నాడు పకీరు. ఇద్దరూ చీకట్లో బయటికి ఇచ్చారు.

"సాయంకాలంనుండి సైమన్ గాడు మాయమయాడు! విశాఖపట్నం వెళ్ళాడా?" అడిగాడు రాజు.

"విశాఖపట్నం యెందుకు వెళ్తాడు?"

"ఏమో వాడి ఆలోచనలు మనకి తెలియవ్!"

"నిజంరా రాజూ! సైమన్ గాడు దేవాంతకుడు. నీకో రహస్యం చెప్పనా!" ఇద్దరూ నడవలోకి వచ్చారు.

"చెప్పరా!"

"సైమన్ గాడి పూర్వీకులు కూడా ఇంద్రమహల్ లో పనిచేసేవారట!"

"నిజమా?"

"అవును. అప్పటికే వాడికి బాగా వూహ తెలుసునట! దారిదోపిడిదారులు వచ్చినప్పుడు మీ తలిదండ్రులు పారిపోవడం వాడికి తెలుసు!"

"పకీరూ! నీకు ఈ విషయాలు యింతకిముందే తెలుసా!"

"తెలిస్తే నీకు చెప్పనా?"

"యెప్పుడు చెప్పాడు?"

"ఈ సాయంకాలం! నిధి యెక్కడుందో కూడా వాడికి తెలిసిందిట!"

"నిధిని యెత్తుకుపోయి పారిపోయాడేమో!"

"పగటిపూట త్రవ్వడం అసాధ్యం! వాడే చెప్పాడు. పైగా మన సహాయం లేనిదే వాడు ఏం చేయలేడు!"

పకీరు గదులవంక చూస్తో ముందుకు నడిచాడు. నడవ మలుపులో విశాలమైన గదిముందు ఇద్దరూ ఆగారు. గది తలుపులు దగ్గరగా వేసివున్నట్టు మసకగా కనిపిస్తున్నాయి.

పకీరు తలుపు లోపలకు నెట్టాడు. తలుపులు కీచుమంటూ తెరుచుకుంటున్నాయి. రాజు గదిలోకి నడిచాడు.

గదిలో కొవ్వొత్తి వెలుగుతోంది.

తలుపులకు ఎదురుగా వున్న గోడలో చిన్నద్వారం తెరుచుకుని వుంది. మనిషి పట్టగలిగేటంత సన్నటి

ద్వారం!

పకీరు టార్చి వెలిగించాడు.

ఇద్దరూ చిన్న ద్వారం దాటారు.

చిన్న ద్వారం వెనుక విశాలమైన హాలు! హాలులో నేలమీద త్రవ్వి కప్పపోసినమట్టి .... మట్టికుప్పమీద ఎవరో బోర్లగిల పడివున్నారు.

రాజూ, పకీరు మొహాలు చూసుకున్నారు.

మెల్లగా మట్టికుప్పను సమీపించారు.

బోర్లగిలపడిన వాడి మొహం ఒక ప్రక్కకు తిరిగి వుంది.

టార్చిలైటు వెలుగు మొహంమీద పడింది. అతడు సైమన్.

కళ్ళు పత్తికాయల్లాగా తెరుచుకుని వున్నాయి.

రాజు గోతిలోకి చూశాడు. గొయ్యి ఖాళీగావుంది.

భవనంలో ప్రేలుడు వినిపించింది.

గోడలు కంపిస్తున్నాయి. అకస్మాత్తుగా మట్టిపెళ్ళలు యెగిరిపడుతున్న శబ్దం వినిపించింది

"రాజూ! కమాన్! క్విక్! భవనంలో బాంబు పెట్టినట్టున్నారు!" అరిచాడు పకీరు.

"అంతే... అంతే....నిధి మొత్తం వాళ్ళ వశం అయిందన్నమాట!"

అతడి మాట ముగియకుండానే నడవాలో గోడలు విరిగి పడ్డాయి. బ్రహ్మాండమైన విస్ఫోటం!

7

తూర్పున కాంతిరేఖలు విచ్చుకుంటున్నాయి. వ్యాన్ డైరీఫారం దాటుతోంది.

"ఇంకా అయిదుమైళ్ళు! ప్లాజాలో పడతాం!" అంది

షకీలా.

బాస్ పకపక నవ్వాడు. షకీలా ఒడిలోకి ఒరిగాడు.

జోషీ మౌనంగా డ్రయివ్ చేస్తున్నాడు. నగర పరిసరాలు రాత్రి బద్ధకం నుండి మెల్లగా ఒళ్ళు విరుచుకుంటున్నాయి.

బాక్ సీట్లోంచి షకీలా బాస్‌ల సంభాషణను మౌనంగా వింటున్నాడు.

"ఇంద్రమహల్ ఈపాటికి మట్టికుప్ప అయివుంటుంది" అంటోంది షకీలా. ఆమె కళ్ళు సీటుకింద పడ్డాయి.

సీటుకింద గోనె సంచులలో బంగారు కాసులూ, జమిందారీల జవ్వాహీ, వెండి నాణాలూ.

"కోట్ల విలువ ఆస్తి, ఈ వ్యాన్‌లో వస్తోన్నట్టు యెవరికి తెలుస్తుంది?" మత్తుగా అంది షకీలా.

ఆమె భుజం పట్టుకుని ముందుకు వొంచాడు బాస్. ఆమె గుండెల్లో మొహం గుద్దాడు.

"షకీ! ఆనాడు నువ్వు ఢిల్లీలో నాతోడా రావడానికి ఇష్టపడలేదు. నా స్వాధీనంలోకి ఇంత ఆస్తి వస్తుందని వూహించి వుండవ్!"

"నిజం! నువ్వు ఇంత తెలివైనవాడని నేను యెలా అనుకోగలను?"

వ్యాన్ కొండప్రక్క మలుపు తిరగబోతోంది.

జోషి వులిక్కిపడి బ్రేకులు నొక్కాడు.

దారికి అడ్డంగా టాక్సీ ఆగివుంది.

టాక్సీ బోనెట్‌ను ఆనుకుని జగ్గా నిలబడివున్నాడు. అతడు కుటిలంగా వ్యాన్ వంక చూశాడు.

"డబ్బు చూచేటప్పటికి మీకు మతులు పోయాయి!"

అరిచాడు జగ్గూ.

“అరె! నువ్వు ఎలా తప్పించుకున్నావ్ రా బద్మాష్!” అన్నాడు బాస్.

జగ్గూ పకపక నవ్వాడు.

“సైమన్ గాడు గది వెనకహాలులో త్రవ్వుతున్నాడు. బాస్! నువు వాడిని టెలిస్కోపిక్ గన్ తో గుమ్మంలో నిలబడి కాల్చావు. అప్పుడే నువు నా పేరు యెత్తావు. నన్ను చంపమని శోషిగాడిని పురమాయించడం నా గదిలోకి వినిపించింది. అంతే—నేను బయటకు పారిపోయాను. బయట పొదలలో నాకు ఈ టాక్సీ కనిపించింది. బహుశా సైమన్ గాడు దీన్ని తెచ్చివుంటాడు. నేను దీంట్లో పారిపోయి వచ్చాను!”

“వచ్చి యిక్కడ కాచుకున్నావేం?”

“నగర పొలిమేరలు! మీరు గొడవ పెట్టుకుంటే అల్లరవుతుంది. అల్లరికి మీరు సిధ్ధపడివుండరు. నాకు వాటా దక్కుతుంది!”

“రాజుగాడితో పాటు నువ్వూ ఆ ఇంద్రమహాల్ శిధిలాలలో ఇరుక్కుపోతావనుకున్నానురా బద్మాష్....” బాస్ మాట ముగియకుండానే టెలిస్కోపిక్ రైఫిల్ కిటికీలోంచి బయటకు వచ్చింది.

“షకీలా!” అరవబోయాడు శోషి.

జగ్గు చటుక్కున బోనెట్ యెత్తి టెలిస్కోపిక్ గన్ తీశాడు. అప్పటికే ఆలస్యమయిపోయింది.

షకీలా చేతిలోని రైఫిల్ పేలింది.

జగ్గా కూలిపోయాడు. రక్తం వరదలాగా రోడ్డు మీదకు కారుతోంది. అతడి భుజంవద్ద కండ యెగిరిపోయింది.

"జోషీ!" అరిచాడు బాస్.

జగ్గూ బాధగా తలెత్తి చూశాడు.

జోషి వేన్ని స్టార్టు చేశాడు. వేన్ కొండని ఒరుసుకుంటూ ముందుకు వొస్తోంది.

జగ్గూ ప్రమాదాన్ని పసిగట్టాడు. అదృష్టం! తూటా తన భుజంలో గుచ్చుకున్నది. కాని తాను ఇప్పుడు వ్యాన్ క్రింద పచ్చడి అవుతాడు!

చటుక్కున టాక్సీకింద దొర్లాడు. అతడి టెలిస్కోపిక్ గన్ని తాకీతాకకుండా వ్యాన్ ముందు కురికింది.

"వాడు చావలేదు! షకీలా! నువ్వు చండాలంగా ప్రవర్తించావ్!" బాస్ నిప్పులు కక్కుతున్నాడు. "చూడు! తుపాకీ శబ్దానికి జనం యిటు వస్తున్నారు!"

వ్యాన్ వేగం పుంజుకుంది. నేషనల్ హైవే దాటి డాబా గార్డెన్స్‌లో చొరబడింది.

"ఈ డబ్బు హోటలుకి ఎందుకు? రాజు గదిలో దాచుదాం!" అన్నాడు బాస్.

జోషి తలూపి కారును అస్సాం గార్డెన్స్ వైపు తిప్పాడు.

8

"డిటెక్టివ్ శిరీష్ ఈజ్ స్పీకింగ్!" అన్నాడు శిరీష్.

"నేను కుమార్ ను. వెంకోజీపాలెం మలుపులో తుపాకీ పేలినట్టు రిపోర్టు వచ్చింది! నీకు ఇంటరెస్టు వుందా?"

"ప్రస్తుతం ఖాళీగా వున్నాను....వస్తాను!"

"ఆల్ రైట్! నేను అక్కడ వుంటాను!" అవతల ఫోన్ క్లిక్ మన్నది.

డిటెక్టివ్ శిరీష్ రిసీవర్ క్రెడిల్ చేశాడు. చకచక బయటకు నడిచాడు. గారేజీలోంచి డాట్సన్ కారు

తీశాడు.

శిరీష్ వెంకోజీపాలెం మలుపులో కారు ఆపాడు. అప్పటికే అక్కడ పోలీసు జీపులు రెండూ, ఒక అంబులెన్స్ వ్యానూ వున్నాయి. డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ కుమార్ తన సిబ్బందికి సూచనలివ్వసాగాడు.

శిరీష్ కారు దిగి పోలీసులవద్దకు నడిచాడు.

రోడ్డుమీద రక్తం మడుగు కట్టివుంది.

కుమార్ తలతిప్పి శిరీష్‌ను చూచి పలకరింపుగా నవ్వాడు.

"ఉదయం అయిదుగంటల ప్రాంతంలో ఇక్కడ తుపాకీ కాల్పు వినిపించిందట. ఇద్దరు ముగ్గురు రైతులు ప్రక్కపొలాల్లోంచి ఇక్కడకు వచ్చేసరికి ఒక పెద్ద కారూ, దానివెనుక కొద్దిసేపట్లో టాక్సీ వెళ్ళిపోతూ కనిపించాయట!" అన్నాడు కుమార్.

శిరీష్ ఆలోచనలో పడ్డాడు.

"తుపాకీని ఎవరు కాల్చారు?" అడిగాడు శిరీష్.

"ఏమో, యెవరు చూడలేదు?"

"టాక్సీ, పెద్దకారు—బహుశా వ్యాన్‌వంటి వాహనం ఒకదానితో ఒకటి పోటీలుపడి పరుగెత్తాయా?"

"ఇక్కడ రోడ్డు టర్న్ కావడంవలన ఏం జరిగిందీ యెవరూ చెప్పలేకపోతున్నారు!"

"ఐ.సీ....రోడ్డుమీద రక్తం వుంది కాని శవంలేదు."

శిరీష్ మాటలు ముగియకముందే వ్రేలిముద్రలనిపుణుడు కుమార్‌ను సమీపించాడు.

"రక్తంతో తడిసిన వ్రేళ్ళముద్రలు రోడ్డుమీద దొరికాయి సార్! రోడ్డుమీద వ్రేలిముద్రలు వదలిపెట్టిన వ్యక్తి తీవ్రంగా గాయపడివుండాలి. తరువాత లేచివెళ్ళి

పోయివుండవచ్చు!" అన్నాడు వ్రేలిముద్రల నిపుణుడు.

"రక్తం స్పెసిమన్ తీసుకున్నారా?"

"పాథాలజీ సర్జన్ గారు తీసుకున్నారు."

"పెద్దకారూ చిన్నకారూ ఒకదాన్నొకటి తరుము కుంటూ నగరంవైపు వెళ్ళాయి కదూ!" అడిగాడు శిరీష్.

కుమార్ తలూపాడు.

"ఆ వాహనాలను నడిపేవాళ్ళను యెవరయినా చూశారేమో?"

"దర్యాప్తు చేద్దాం!"

"తీవ్రంగా గాయపడిన వ్యక్తి టాక్సీలోని వ్యక్తా? వ్యాన్‌లోని వ్యక్తా?"

"వ్యాన్‌ని టాక్సీ తరుముతోంది. టాక్సీయే ఆలస్యంగా బయలుదేరింది. అంటే గాయపడిన వ్యక్తే బలం కూడ దీసుకుని తిరిగి వ్యాన్‌ని ఫాలో అయ్యాడనుకోవాలి."

9

బాస్ వాచీ చూసుకున్నాడు.

ఉదయం పదిగంటలు!

జోషి బయటికి జగ్గుకోసం వెళ్ళాడు. ఆటోలో వస్తానని ఆరుగంటలకు డాబా గార్డెన్స్‌లో దిగిన షకీలా యింతవరకూ రాలేదు.

షకీలా ఏమయింది? ఆమె జోషిని కలసిందా? జగ్గా తీవ్రంగా గాయపడి కూడా టాక్సీలో తమని కొంతదూరం వరకు వెంటాడాడు. వాడికి తర్వాత ఏం జరిగింది? తాను యింతసేపూ రాజా గదివద్ద కాపలావుండి వచ్చాడు.

షకీల జగ్గుకోసం వెళ్ళివుంటుంది.

బల్లమీది టెలిఫోన్ గణగణలాడింది. బాస్ రిసీవర్ యెత్తాడు.

"ఎస్ .... చెప్పు!" అన్నాడు బాస్.

"నేను బాస్! జోషిని! జగ్గుగాడు కనిపించాడు."

"యెక్కడ?"

"జైల్ రోడ్డుమీద. సరిగ్గా వాల్తేరు సిమెట్రీ దగ్గర పెట్రోలు అయిపోయినట్టుంది. అక్కడే ఆగిపోయింది కారు!"

"జగ్గూకి ఎలావుంది?"

"తెలియదు బాస్ టాక్సీ చుట్టూ పోలీసులు!"

"జోషీ! ..." బాస్ చూపు నిలిబడిపోయింది. కిటికీ లోంచి అవతలి భవనం కిటికీ స్పష్టంగా కనిపిస్తోంది. ఆ కిటికీవద్ద ఎవరో బైనాక్యులర్స్‌తో నిలబడివున్నారు.

బైనాక్యులర్స్ తన కిటికీవైపే గురిపెట్టి వున్నారు.

ప్రస్తుతం తన వునికి జోషికి షకీలాకి తప్ప యెవరికి తెలియదు! రాజా, సైమన్ ఇంద్రమహల్‌లో చచ్చిపోయివుంటారు! జగ్గూ.... వాడు పోలీసుల చేతులలో పడితే..అవును పడ్డాడు. తన రహస్యం చెప్పివుంటాడా?

"బాస్ మాట్లాడరేం?"

"చెబుతాను. మనగది కిటికీకి అవతలివైపున భవనం లోంచి ఎవరో మననే చూస్తోన్నట్టు...." బాస్ ఆగిపోయాడు. బైనాక్యులర్స్ కిటికీలోంచి తప్పుకున్నాయి.

కిటికీలోంచి నల్లటి వలయం కనిపిస్తోంది.

అదేమిటి?....

బారెల్ ....తుపాకీ గొట్టం....

బాస్ చటుక్కున గోడప్రక్కకి తప్పుకోబోయాడు.

గుండెలలో అగ్గిరవ్వ దూరినట్టయింది. కూకటివ్రేళ్ళతో కూలిపోయే చెట్టులాగా బాస్ నేలమీదకు ఒరిగి పోయాడు. రిసీవర్‌కి వున్న వైర్ పొడవుగా సాగింది.

క్షణంపాటు శరీరం తిరగబడింది.

రిసీవర్ అతడి శరీరం క్రిందపడి తునాతునకలయింది.

10

రాజు వగరుస్తున్నాడు. అర్థరాత్రినుండి ఫకీరు తానూ కలసి నడుస్తున్నారు. ఇంద్రమహల్ లోంచి తాము బయట పడటం ఒక్క క్షణం ఆలస్యమైవున్నా చాలును, తామిద్దరూ సమాధి అయేవాళ్ళు! భవనం పెద్ద మట్టి కుప్పలాగా అయింది.

దుర్మార్గులు! టాక్సీని కూడా పట్టుకుపోయారు.

నాటుదారిన అడ్డంపడి యెలాగయితేనేం తామిద్దరూ పదిమైళ్ల దూరం నడిచారు. రాళ్ళు గుచ్చుకుని కాళ్ళు రక్తాలు కారుతున్నాయి. ముళ్ళపొదల్లో దూరి బట్టలు చీలికలయాయి. నడకలోనే తెల్లవారింది.

ఫకీరు మౌనంగా నడుస్తున్నాడు.

ఎండ తీవ్రంగా వుంది.

ఉదయం తొమ్మిదయింది.

ఇద్దరూ నాటుదారి వదలిపెట్టారు.

సిమెంటు రోడ్డుమీద మరో గంట గడిస్తేకాని మధురవాడ గ్రామం తగలలేదు.

విశాఖపట్నంనుండి వస్తోన్న ఇరవైఅయిదో నెంబర్ సిటీబస్సు మలుపుతిరిగి షెల్టర్ వద్ద ఆగింది.

"సిటీబస్సు ఎక్కుదాం. నా దగ్గర డబ్బులున్నాయి" అన్నారు ఫకీరు.

వాళ్ళిద్దరిముందూ పోలీస్ జీపు ఆగింది.

జీపులోంచి నలుగురు పోలీసులు దిగి వాళ్ళను చుట్టు ముట్టారు.

వాళ్ళలో క్రైంబ్రాంచ్ యిన్స్పెక్టర్ కుమార్ను

గుర్తుపట్టాడు ఫకీరు.

కుమార్ కూడా యిద్దరినీ గుర్తుపట్టాడు. "మీరిద్దరూ జేబుదొంగలు కదా!" కర్కశంగా అరిచాడు కుమార్.

రాజూ, ఫకీరూ తలలూపారు.

"మీ యిద్దరితో తిరిగే సైమన్ ఇంద్రమహల్‌లో చనిపోయాడు, అవునా?" అడిగాడు కుమార్.

రాజూ, ఫకీరూ మొహాలు చూసుకున్నారు.

"జగ్గు దొరికాడు. వాడే చెప్పాడు రాజు ఇంద్ర మహల్‌లో వున్నట్టు."

"బాస్ దొరికాడా సార్?" అడిగాడు రాజు.

"బాస్ యెవరు?"

"జగ్గు చెప్పలేదా?"

"జగ్గు నీగురించి ఒక ముక్క చెప్పి చచ్చిపోయాడు!"

రాజు నిట్టూర్చి చెప్పడం మొదలుపెట్టాడు.

11

హోటల్ ప్లాజా ఆవరణలో పోలీస్ జీపులు ఆగాయి. కుమార్, పోలీస్ సిబ్బంది, డిటెక్టివ్ శిరీష్ హోటలులో ప్రవేశించారు. రెండో అంతస్తులో పన్నెండో నెంబర్ రూంముందు ఆగారు.

రూం తలుపులు బార్లా తెరిచివున్నాయి.

గదిలో నేలమీద ఒక ఆకారం బోర్లగిల పడివుంది. నేలమీద రక్తం మడుగుకట్టింది. అతడి బట్టలు రక్తంతో తడిసివున్నాయి. వీపువద్ద పెద్ద రంధ్రం కనిపిస్తోంది.

శిరీష్ గదిలో పరిశీలనగా చూశాడు.

గోడదగ్గరేదో వస్తువు ఎర్రగా మిలమిలలాడుతోంది.

శిరీష్ నేలమీదకు ఒంగాడు.

రక్తంలో తడిసిన తూటా.

వ్రేలిముద్రల నిపుణుడూ, ఫోటోగ్రాఫరూ తమ విధి నిర్వహణలో మునిగిపోయారు.

పోలీసుల అట్టహాసానికి హోటల్ మేనేజర్ గడగడ లాడిపోయాడు.

"ఈ గది ఎవరి పేర బుక్ అయింది?" అడిగాడు కుమార్, గదిలోంచి బయటకు వచ్చి.

"కుందన్ లాల్, ఢిల్లీ నుండి విహారయాత్రకి వచ్చాడు."

"యిది డబుల్ రూం కదూ!"

"అవున్సార్!"

"అతడి కూడా ఎవరు వచ్చారు?"

"అతడి కూడా ముగ్గురు నలుగురు వచ్చారు. నాకు వాళ్ళెవరో సరిగ్గా గుర్తులేదు."

"ఏం?"

"రోజూ వెయ్యిమంది వస్తారు వెళ్తారు ఎవరు ఎవరి తాలూకాయో పట్టించుకునే తీరికా వ్యవధీ నాకు వుండవ్!"

"గదిలో స్త్రీలుపయోగించే కాస్మెటిక్స్ వున్నాయి. కుందన్ లాల్ వెంట స్త్రీలు వచ్చారా?"

"అతడి భార్య షకీలా!"

"ఆమె ఒక్కతే వచ్చిందా?"

"అవును స్త్రీ అయితే ఆమె ఒక్కతే!"

"ఈ ఉదయంనుండీ ఆమె బయట కనిపించిందా?"

"లేదు సార్! మూడు రోజులనుండి ఈ గదికి నేను ఎలాంటి బిల్లులూ జమచేయలేదు."

"ఏం?"

"మూడు రోజులక్రితం కుందన్ లాల్ తన కుటుం బంతో బయటికి వెళ్ళినట్టు రూం సర్వీస్ బాయ్

చెప్పాడు!"

"అంటే గదిని తన స్వాధీనంలో నే వుంచుకుని!"

"అవును సార్!"

"అతడు వాహనంలో వచ్చాడా?"

"తెలియదు సార్!"

"షకీలాగానీ, కుందన లాల్ అనుచరులుగానీ తిరిగి హోటల్ కి వస్తే మాకు తెలియచేయండి!"

"తప్పకుండా సార్!"

ఫోటోగ్రాఫరూ, వేలిముద్రల నిపుణుడూ గది లోపలకు వచ్చారు.

పాథాలజీ సర్జన్ చేతులకివున్న గ్లవ్స్ తొలగించుకుని కుమార్ ని సమీపించాడు.

"తుపాకి తూటాతో ప్రాణం పోయింది. క్షణాల వ్యవధిలో ప్రాణంపోయింది."

"ప్రాణంపోయి యెంతసేపయి వుంటుంది?"

"గంటలోపు. శవం యింకా గదిలోని ఉష్ణోగ్రతకి సమానమైన ఉష్ణోగ్రతలో వుంది."

"డాక్టర్ గారూ! ప్రాణం యెలాపోయి వుంటుందని మీ వూహా!"

"హతుడు టెలిఫోన్ చేస్తూండగా తూటా తగిలింది. శరీరంలోంచి తూటా వెనకభాగానికి దూసుకువచ్చి గదిలో గోడదగ్గర పడింది."

"అంటే హతుడు కిటికీకి తిన్నగా అంటే మొహం పెట్టి నిలబడి వుండాలి!"

"అవును. టెలిఫోన్ వున్న స్థితినిబట్టి అలాగే అను కోవాలి."

శిరీష్ మెల్లగా దగ్గాడు.

కుమార్ చెప్పమన్నట్టు చూశాడు.

"హంతకుడు రిసీవర్‌ను క్రెడిల్ చేయలేదు. అంటే లైన్ యింకా డిస్‌కనెక్టు కాలేదన్నమాట!"

"డిస్‌కనెక్షన్ కాకపోతే మనకేం?"

"కుమార్! చనిపోయిన వ్యక్తి కుందన్‌లాల్. అతడు తన పరివారంతో ఇంద్రమహల్‌ను శోధించాడు. రాజు మాటలనుబట్టి ఆ స్త్రీని చేజిక్కించుకున్నాడు. హోటల్ గదిలోకి వచ్చాడు. సరిగ్గా నాలుగు గంటల తర్వాత తన హోటల్ గదిలో చచ్చిపడివున్నాడు. చనిపోవడంకూడా టెలిఫోన్‌లో మాట్లాడుతూ చనిపోయాడు. గదిలో ఆ స్త్రీ వున్నట్టులేదు. హోటల్ ఫర్నిచర్ తప్పించి అతడి సొంత లగేజిలేదు. అంటే మూడురోజుల క్రితం అతడి గదిని ఖాళీచేస్తోన్నట్టు చేసి గదిని తన స్వాధీనంలో ఉంచుకున్నాడన్న మాట...."

"అవును. అయితే....అతడి ముఠాలోనే యెవరో ఈ హత్య చేశారంటావా?"

"అవును. రాజు చెప్పినమాట నిజమైవుంటే కుందన్‌లాల్‌కి షకీలా భార్యగా నటిస్తోంది. వాళ్ళది చట్ట సమ్మతమైన పెళ్ళికాదు. పైగా యిద్దరికీ వయస్సుల మధ్య తేడా చాలా వుంది!"

కుమార్ అయోమయంగా చూశాడు.

"పాయింటుకి వస్తున్నాను. తూటా కిటికీలోంచి దూసుకువచ్చింది. ఎలా వచ్చి వుంటుంది. కిటికీలోంచి అవతలప్రక్క ఉన్నది సన్ ఎన్ సాండ్ హోటల్. ఈ గది కిటికీకి సమాంతరంగా ఉన్న గదిలోంచి తూటా దూసుకువచ్చింది. అంటే హత్య చేసినవాళ్ళు ఈ కిటికీకి యెదురుగా ఉన్న సన్ ఎన్ సాండ్ గదిని అద్దెకు తీసు

కని ఉంచుకున్నారన్న మాట!"

"వెరీగుడ్ లాజిక్!"

"ఈ గదిలోకి వచ్చిన టెలిఫోన్ కాల్ సన్ ఎన్ సాండ్ గదిలోంచి వచ్చిఉండాలి!"

కుమార్ కళ్ళు పెద్దవిచేసి చూశాడు.

"నాకు పరిస్థితి అర్థమవుతోంది. కుందన్‌లాల్‌ని హత్య చేయాలని వేసుకున్న పథకం యిప్పుడు స్పష్టమయింది. ఆ గదిలో యిద్దరు వుంటారు. ఒకడు ఫోన్ చేసి కుందన్‌లాల్‌ని టెలిఫోన్ దగ్గరకు రప్పిస్తాడు. టెలిఫోన్‌లో మాట్లాడే వ్యక్తి కిటికీకి తిన్నగా నిలబడవలసి వస్తుంది! హత్యచేసే తుపాకీకి గురి కుదురుతుంది. అతను మాట్లాడేటప్పుడు ఆ గదిలోవున్న తుపాకీ ప్రేలుతుంది."

శిరీష్ శవాన్ని దాటుకుంటూ కిటికీలోంచి అవతలకు చూశాడు!

"ఈ రెండు కిటికీల మధ్య పాతిక అడుగుల రోడ్డు ఉంది. అటు పది అడుగులూ ఇటు పదడుగులూ మొత్తం నలభైఅయిదూ—యాభై అడుగుల దూరంలో తుపాకీ టార్గెట్ వున్నాయి. తూటా తన లక్ష్యాన్ని ఛేధించింది."

"అవతల హోటల్ గదికి వెళ్దాం!"

12

బల్లమీది టెలిఫోన్ గణగణలాడింది.

షకీలా రిసీవర్ ఎత్తింది.

"షకీలా నేను జోషిని మాట్లాడుతున్నాను."

"మధురవాడ పోస్టాఫీసు నుండి!"

"సక్సెసయిందా?"

"అయిందనుకుంటాను. దూరంనుండి బైనాక్యులర్స్‌తో చూశాను. పోలీసులు శిథిలాలు త్రవ్వుతున్నారు. పైమన్

శవం బయటపడింది. ఇంకా రాజుగాడి శవం దొరకాలి!”

“అదే దొరుకుతుంది వచ్చెయ్యి.”

“అలాగే... జగ్గా మనగురించి ఏమీ చెప్పకుండానే చచ్చిపోయాడు. అదృష్టం! బాస్ శవం దగ్గర కూడా మన ఆచూకీ తెలియలేదు.”

“వెరీగుడ్! నాకు ఒంటరితనంగా వుంది రా! వచ్చెయ్యి!”

“ఆల్ రైట్!” అవతల క్లిక్ మన్నది.

13

“సైమన్ శవంలోంచి బయటపడిన తూటా, కుందన్ లాల్ శవంలోంచి బయటపడిన తూటా ఒకే తుపాకీ లోంచి ప్రేల్చినవి. .28 బోర్ రాస్ ఏక్సివెరీటెక్ రైఫిల్ లోంచి వచ్చిన తూటాలవి! కుందన్ లాల్ హత్య సందర్భంలో ఆ తుపాకీకి టెలిస్కోప్ ఏర్పాటు అమర్చి వుండాలి. అందుకే లక్ష్యభేధనలో తూటా దానికున్న వేగం సెకండుకి 4,500 అడుగుల చొప్పున ప్రయాణించింది” అన్నాడు బాలిస్టిక్ ఎక్స్పర్ట్.

శరీష్ క్షణం ఆలోచించి “జగ్గాని గాయపరచింది కూడా అదే తుపాకీలోంచి బయటపడ్డ తూటా అయి వుంటుందా?” అన్నాడు.

ఎక్స్పర్ట్ తన కాగితాల్లో తలదూర్చాడు.

“జగ్గా వ్యవహారంలో మనకి తూటా దొరకలేదు. అయితే అతడి భుజానికయిన గాయం తుపాకీ తూటా వల్లనే యేర్పడివుండాలి. గాయంవద్ద కండరాలు నలిగిన ఒత్తిడిని ఫోరెన్సిక్ లాబ్ లో గమనించ గలిగాను. ఒత్తిడిశక్తి 2,8000 ఫుట్ పౌండ్లు. అంత శక్తితో తూటాను వెలువరించే శక్తి .28 బోర్ రాస్ ఏక్సి

లెరెలెడ్ రైఫిల్ కే వుంది."

"మై గుడ్ నెస్! క్రూరజంతువులను వేటాడే పాత కాలం నాటి తుపాకీ!" అన్నాడు కుమార్.

సార్జెంట్ లోపలకు వచ్చాడు.

కుమార్ ఏమిటన్నట్టు చూశాడు.

"టాక్సీ దొరికింది సార్! సన్ ఎన్ సాండ్ హోటల్ వెనుకవున్న తుమ్మపొదల మధ్య ఆగివుంది. మెటాడోర్ వ్యాన్ లోనూ, టాక్సీలోనూ వ్రేలిముద్రలు సేకరించాం!"

"వెరీగుడ్!" శరీఫ్ బల్లమీద వంగాడు.

కుమార్ కి సూచనలివ్వసాగాడు.

"ఆల్ రైట్! నువ్వు చెప్పినట్టుగా అన్ని దినపత్రికలలో వేయిస్తాను!" అన్నాడు కుమార్.

14

"షకీలా భవనం మెట్లు యెక్కింది. ఒక గదిలో ప్రవేశించింది. కిటికీవద్దకు నడిచింది. కిటికీలోంచి బయటకు చూచింది. జనరల్ ఆస్పత్రి భవనంలో ఆ భాగం కనిపిస్తోంది. గాజు కిటికీకి ప్రక్కగా రాజు పడుకుని ఉన్నాడు. అతడి శరీరమంతా కట్టుకట్టివుంది.

బైనాక్యులర్స్ తో అతడిని పరిశీలనగా చూసింది. చకచక ఎయిర్ బాగ్ లోంచి టెలిస్కోపిక్ రైఫిల్ తీసి బారల్ ఫిట్ చేసింది. గురిచూస్తూ ట్రిగ్గర్ లాగబోయింది.

ఆమె చేతిలోవున్న రైఫిల్ యెగిరిపడింది. చేతికి నిప్పుకణిక అంటించినట్టయింది రక్తం కారుతోంది.

షకీలా తెల్లబోయింది.

రైఫిల్ కింద పిట్టగోడమీద పడింది.

షకీలా కిందకు చూచింది.

క్రైంబ్రాంచ్ ఇన్ స్పెక్టర్ కుమార్ పిట్టగోడ

మీద నిలబడ్డాడు. అతడి చేతిలో రివాల్వర్ ఆమె తలకు గురిపెట్టివుంది.

షకీలా వెనక్కి పరుగెత్తి తలుపులు తీసింది.

పోలీసులు యెదురువచ్చారు.

డిటెక్టివ్ శిరీష్ ఆమెను సమీపించాడు.

“షకీలా! నీ వ్రేలిముద్రలు నిన్ను పట్టించాయి. సన్ ఎన్ సాండ్ గదిలో, వ్యాన్‌లో, ప్లాజాలో పన్నెండో గదిలో నీ వ్రేలిముద్రలే! నీతో పాటువున్న వ్రేలిముద్రల్లో నీకు సహాకరించిన వ్యక్తి వ్రేలిముద్రలు సన్ ఎన్ సాండ్ గదిలో టెలిఫోన్ మీద దొరికాయి. ఆఫ్‌కోర్స్! జగ్గూ, కుందన్‌లాల్, సైమన్‌లను కాల్చింది ఈ రైఫిల్‌తోనే అనే విషయం పరిశోధనలో తెలుస్తుంది. రాజు మాకు దొరికినట్టు నీకు తెలిసివుండదనే తెలుసుకుని దినపత్రికలలో అతడు జనరల్ ఆస్పత్రిలో వున్నట్టు ప్రకటన ఇచ్చాం!” అన్నాడు శిరీష్.

కుమార్ పైకి వచ్చాడు. అతడి చేతిలో రైఫిల్ వుంది.

“ఇంద్రమహల్‌లో ఆస్తిని చేజిక్కించుకోవడమే కాకుండా ఆస్తికి మిగిలిన వారిసుడిని కూడా మట్టుపెట్టాలని ప్రయత్నించావు. కుందన్‌లాల్‌ని చంపి ఆ ఆస్తితో పారిపోయివుంటే నిన్ను పట్టుకోవడం కాస్త కష్టమయ్యేది” అన్నాడు కుమార్.

“అంతేకాదు! షకీలా గురించీ ఆమె ప్రియుడిగురించీ ఖచితమైన సమాచారం యివ్వగలిగేది రాజు ఒక్కడే! అందుకు కూడా అతడిని మట్టుపెట్టాలని చూసింది షకీలా!” అన్నాడు శిరీష్.

షకీలా తల వొంచుకుంది.

—:ఐపోయింది:—